క్లుప్తంగా

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం


వెంకటరమణ దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కొయ్యలగూడెం: ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించి గత నెలలో రిటైర్డ్ అయిన సోంభట్ల వెంకటరమణను పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సత్కరించారు. బయ్యన గూడెంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వెంకటరమణ దంపతులకు పూర్వ విద్యార్థులు సత్కరించి ఆయన సేవలు కొనియాడారు. నలభై ఒక్క సంవత్సరాల పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా పని చేసి వేలాది మంది విద్యార్థుల భవితకు వెంకటరమణ పునాది వేశారని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా తన సేవలను విద్యార్థులకు అందిస్తానని పేద విద్యార్థులకు ఉచితంగా చదువుకోవడానికి సహకరిస్తానని వెంకటరమణ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి


ఎమ్మెల్యే బాలరాజుకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ ప్రాజెక్టు లీడర్ వి.కృపామణి, అంగన్‌వాడీ జీలుగుమిల్లి మండల అధ్యక్షురాలు యు.నాగమణి సీఐటీయు నాయకురాలు మొడియం నాగమణిలు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీసం వేతనం రూ.26,000 ఇవ్వాలని, సుప్రీం కోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ అమలు చేయాలని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో కె.పుష్ప, టి.రామలక్ష్మి, ఎస్తేరు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ జిల్లా నాయకులు ఎ.జాన్ బాబు

ఏలూరు (టూటౌన్): చింతలపూడి మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి, కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్‌లు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు జిల్లా కమిటీ కోరింది. జిల్లా కమిటీ సమావేశం ఆదివారం సీఐటీయూ కార్యాలయంలో బి.బాలరాజు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం వివరాలను యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జాన్ బాబు పత్రికలకు తెలిపారు. చింతలపూడి గ్రామ పంచాయతీ నుంచి నగర పంచాయితీగా మారి 4 సంవత్సరాలు గడిచిందని, మున్సిపల్ కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని తెలిపారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ వెంటనే జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులు రూ.20 వేలుకు సంబంధించి జీవో విడుదల చేయాలని, రిటైర్డ్ అయిన కార్మికులకు రూ.75 వేలు గ్రాట్యుటీ చెల్లింపునకు సంబంధించిన జీవో విడుదల చేయాలన్నారు. ఈ నెల 10న దేశ వ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ డిమాండ్స్ డే కార్యక్రమంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో వినుకొండ రమేష్, లావేటి కృష్ణారావు, ఆర్.నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల కరపత్రాల ఆవిష్కరణ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 24 నుంచి మూడు రోజుల పాటు మదనపల్లి జిల్లా హార్స్‌లీ హిల్స్‌లో నిర్వహించనున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర స్థాయి విద్యా,వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలను ఆదివారం ఏఐటీయూసీ నాయకులు ఆవిష్కరించారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతులకు సంబంధించిన నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఏలూరు జిల్లా నుంచి ఎంపిక చేసిన 16 మంది ప్రతినిధులు ఈ శిక్షణ తరగతులకు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిక చేసిన కార్మికవర్గ ప్రతినిధులకు నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారని అనంతరం శిక్షణ పొందిన ప్రతినిధులు ఆయా జిల్లాలో మున్సిపల్ కార్మికులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

మెట్టలో వర్షాల దోబూచులాట

- పూర్తి స్థాయిలో నిండని చెరువులు
- వెదజల్లే పద్ధతి మేలంటున్న వ్యవసాయాధికారులు


వెదజల్లే పద్ధతిలో వరి విత్తనాలను జల్లుతున్న రైతులు (ఫైల్)


మెట్ట ప్రాంతంలో పూర్తిగా నిండని పెద్ద చెరువు

చింతలపూడి: మెట్ట ప్రాంతంలో వర్షాలు దోబూచులాడుతున్నాయి. దీంతో ఇంకా చెరువుల్లో కావలసినంత నీరు చేరలేదు. మరో పక్క వ్యవసాయాధికారులు మాత్రం భయపడాల్సిన అవసరం లేదని ఈ నెలాఖరు వరకు వర్షాలు కురుస్తాయంటున్నారు. సబ్ డివిజన్‌లో రైతులు 15,793 హెక్టారుల్లో వరి సాగు లక్ష్యంగా చేసుకున్నారు. నియోజకవర్గంలో శాశ్వత సాగునీటి వసతులు లేకపోవడంతో రైతులు వర్షాధారమైన చెరువులు, వ్యవసాయ బోర్లపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 450 మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం వ్యవసాయానికి కావలసినంత నీరు చెరువుల్లో చేరలేదు. ముఖ్యంగా మండలంలోని సమ్మెటవారిగూడెం, మల్లాయగూడెం, పాత చింతలపూడి తదితర ప్రాంతాల్లో రైతులు ఏటా విత్తనాలు వెదజల్లే పద్ధతిలో నాట్లు వేస్తుంటారు. ఖరీఫ్ వ్యవసాయం ఇప్పటికే ఆలస్యం కావడంతో రైతులు వెదజల్లే పద్ధతిని ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది రైతులు ఖరీఫ్ సీజన్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. జూన్‌లో ఆసించిన వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు జూలైలో అయినా వర్షాలు కురుస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల రుతు పవనాలకు తోడు అల్ప పీడన ప్రభావం వల్ల అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు దుక్కులు దున్ని వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టారు. వర్షాలు ఆలస్యం అయితే ఎదురు చూడకుండా వెదజల్లే పద్ధతిలో సాగుకు సమాయత్తమవుతున్నారు. మండలంలో అక్కడక్కడా బోర్ల కింద నారుమడులు వేసినా అసలు వర్షాలు పడకపోతే ఎలా అన్న ప్రశ్న రైతులను పీడిస్తోంది. వరి వెదజల్లే పద్ధతిలో నీటిని ఆదా చేయడంతోపాటు, కూలీల సమస్య ఉండదని, ఖర్చు సగానికి తగ్గుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వెదజల్లే పద్ధతిలో ఎకరానికి 12 నుంచి 16 కేజీల విత్తనాలు సరిపోతాయి. ఖర్చు కొంత తగ్గినా ఈ విధానంలో ఖచ్చితంగా ఇంత దిగుబడి వస్తుందని ఎవరూ చెప్పలేకపోతున్నారు. వర్షాలు సకాలంలో పడక పోతే వెదజల్లే పద్ధతిలో కూడా పంట ఎండిపోయే ప్రమాదం లేకపోలేదు. దీంతో సొంత పొలాల రైతులు తప్ప, కౌలు రైతులు ఈ పద్ధతిపై విముఖత చూపుతున్నట్టు తెలుస్తోంది. వెదజల్లే పద్ధతిలో రైతులు పొలాలను ముందుగా దమ్ము చేసుకోవాలి. విత్తనాలు చల్లే సమయంలో పొలంలో నీరు లేకుండా చూసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం


రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన టాటా మ్యాజిక్ వాహనం

జంగారెడ్డిగూడెం రూరల్: ఏలూరు వైపు వెళుతోన్న టాటా మ్యాజిక్ వాహనం మండలంలోని గురవాయిగూడెంలో అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో టాటా మ్యాజిక్ వాహనంలో వారికి ఏమీ కాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు సహాయక చర్యలు చేపట్టి టాటా మ్యాజిక్ వాహనాన్ని రహదారి పైకి చేర్చారు.

వర్షాలకు రహదారులు అధ్వానం


రహదారిపై ఏర్పడిన గుంతలు

లింగపాలెం: వర్షాలకు లింగపాలెం మండలంలోని ఏలూరు–చింతలపూడి వెళ్లే ప్రధాన రహదారి పలుచోట్ల గుంతలు పడి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధర్మాజీగూడెం మార్కెట్ యార్డు సమీపంలో ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గోతులు పడటంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే ప్రయాణీకులు పలుసార్లు రాత్రి సమయంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారిపై గోతులను పూడ్చి ప్రమాదాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

మహానేత పాలనలో ప్రగతి పథంలో మన్యం

నేడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి


మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి ఏజెన్సీ సమస్యలపై వినతి పత్రం ఇస్తున్న బాలరాజు(ఫైల్ ఫోటో)

బుట్టాయగూడెం: మహానేత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనా సమయంలో పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి ప్రగతి పథంలో పయనించిందని, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం దుద్దుకూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో ఆయనకున్న అనుబంధం ఆ మహానేత చేసిన అభివృద్ధి పనులను వివరించారు. గిరిజన విద్యార్థుల ఉన్నత చదువులకు దూరమై డ్రాప్‌ఔట్స్‌గా మిగులుతున్న సమయంలో జూనియర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యల్లో ముందుకు సాగే విధంగా కృషి చేశారన్నారు. అలాగే నియోజకవర్గ స్థాయిలో 70 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిన ఘనత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనన్నారు. 400 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసి రహదారుల సమస్య తీర్చారన్నారు. అటవీ హక్కుల చట్టంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా భూములను పేదలకు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పంచారని గుర్తుచేశారు. అలాగే రూ.26 కోట్ల వ్యయంతో గిరిజనుల బీడు భూములకు సాగు నీరు అందించే విధంగా పోగొండ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. అదే విధంగా ప్రతీ ఏటా కొండ కాలువల ప్రవాహానికి అనేక మంది గిరిజనులు మృతి చెందుతుంటే వాటిని నివారించేందుకు రూ.26 కోట్లతో నాలుగు ప్రదేశాల్లో హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేశారన్నారు. పోలవరం మండలంలో ప్రతీ సంవత్సరం గోదావరి వరద నీరు ప్రవాహానికి 50 వేల ఎకరాల పంట భూములు ముంపునకు గురై రైతులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూడా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చొరవేనని తెలిపారు. ఈ నేపథ్యంలో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సుమారు రూ.70 కోట్లతో కొవ్వాడ ఔట్‌ఫాల్స్ స్లూయిస్ పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. అలాగే ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 5 ప్రభుత్వ ఆస్పత్రులు, జంగారెడ్డిగూడెంలో 100 పడకల హాస్పిటల్ నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. నాడు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులను చూసి ఆయనను దేవుడిగా కొలుచుకుంటున్నారని చెప్పారు. మరలా అదే రీతిలో తండ్రి బాటలో పాలన చేసి ముఖ్యమంత్రిగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు.

కొయ్యలగూడెం: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు తెలిపారు. కొయ్యలగూడెం వైఎస్సార్ నగర్‌లోని మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ముఖ్య నాయకులతో జయంతి వేడుకల అనంతరం సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. 18 పంచాయతీల పరిధిలోని గ్రామాలలో జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కార్యక్రమాలకు పార్టీ శ్రేణులు, మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అభిమానులు హాజరు కావాలని కోరారు.

లింగపాలెం: మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి పురస్కరించుకొని సోమవారం లింగపాలెంలో రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొఠారి మోహనరావు తెలిపారు. ఈ మేరకు సాయంత్రం 5 గంటలకు చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కంభం విజయరాజు, నాయకుల చేతుల మీదుగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతు బాంధవుడు.. మహానేత వైఎస్సార్


వామిశెట్టి హరిబాబు

జంగారెడ్డిగూడెం రూరల్: రైతు బాంధవుడు.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాలు ఈ నెల 8న మండల వ్యాప్తంగా నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు. మండలంలోని పుట్లగట్లగూడెంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించాలన్నారు. జయంతి కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని హరిబాబు కోరారు.

హత్యకు గురైన తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడికి నివాళి

ఏలూరు (టూటౌన్): హత్యకు గురైన తమిళనాడు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్‌కు జిల్లా బీఎస్పీ నాయకులు ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఘన నివాళులర్పించారు. స్థానిక నవ సమాజ్ సొసైటీ కార్యాలయంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయాలి

కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకుల డిమాండ్


అగ్నిమాపక కేంద్రం మంజూరు చేయాలని అభ్యర్థిస్తున్న ఎస్సీ సెల్ నాయకులు

కొయ్యలగూడెం: మండల కేంద్రమైన కొయ్యలగూడేనికి అగ్ని మాపక కేంద్రాన్ని మంజూరు చేయాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.రాజారత్నంతో కలిసి ఇటీవల అంకాలగూడెంలో అగ్నిప్రమాద బాధితులను పరామర్శించారు. మూడు దశాబ్దాలుగా సార్వత్రిక ఎన్నికల వేళ ప్రతీసారి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు డిమాండ్ ప్రజల నుంచి వస్తూనే ఉంది. దీనిపై మంజూరు చేస్తామని హామీ ఇస్తూనే దాటవేత వైఖరి అవలంభిస్తున్నారన్నారు. వర్జీనియా పొగాకు బేరన్‌ల క్యూరింగ్ సమయంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అదే విధంగా నివాసిత ప్రాంతాలకు సైతం అగ్ని ప్రమాదాలు సంభవించిన సంఘటనలుగా కోకొల్లలుగా ఉన్నాయని తెలిపారు. దగ్గరలో అగ్నిమాపక కేంద్రం ఉన్నట్లయితే సకాలంలో మంటలను అదుపు చేసి, ఆస్తి నష్టం బాగా తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. కానీ పదిహేను కిలోమీటర్ల నుంచి అగ్నిమాపక వాహనం వచ్చే సరికి తీవ్ర నష్టం కలుగుతోందని, సీతంపేటలో కొన్ని సంవత్సరాల క్రితం ఇరువురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారన్న విషయం గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అగ్ని మాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు ఈ సందర్భంగా కోరారు.

మానవత నూతన కార్యవర్గాల ఎన్నిక


జంగారెడ్డిగూడెం: మానవత నూతన కమిటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


ద్వారకాతిరుమల: ప్రమాణస్వీకారం చేస్తున్న మానవత స్వచ్ఛంద సేవాసంస్థ మండల నూతన కమిటీ


కొయ్యలగూడెం: మానవత మండల శాఖ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మానవత నూతన కమిటీ ఆదివారం ఏర్పాటైంది. ఈ సందర్భంగా నూతన కమిటీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికలో మానవత మండల అధ్యక్షుడిగా అయినాల రమణమూర్తి, కార్యదర్శిగా మహంకాళి రంగ ప్రసాద్, కోశాధికారిగా ఇమ్మంది మాధవరావు, ఉపాధ్యక్షుడిగా అల్లూరి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా వల్లి వెంకటరెడ్డి, ఈసీ సభ్యులుగా దల్లి రామాంజనేయరెడ్డి, పెనుమర్తి సురేష్, మొగళ్లపు శ్యామ్, భరద్వాజ రామకృష్ణలు ఎన్నికయ్యారు. అనంతరం మొదటి సేవా కార్యక్రమంగా మానవత సభ్యుల వితరణతో 6, 8 తరగతుల విద్యార్థులిద్దరికి రూ.8,900 ఆర్థిక సాయమందించారు. కార్యక్రమంలో మానవత జిల్లా కన్వీనర్ త్రిపుర రమేష్, మానవత సభ్యులు పాల్గొన్నారు.

మానవత మండల కమిటీ ప్రమాణస్వీకారం

ద్వారకాతిరుమల: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని స్థానిక శ్రీశ్రీనివాస కళాశాలలో ఆదివారం నిర్వహించారు. సంస్థ మండల చైర్మన్ దావులూరి ప్రభాకరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహన్‌రావు, జిల్లా విద్యానిధి కమిటీ చైర్మన్ ఆలపాటి నాగేశ్వరావులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సంస్థ మండల నూతన అధ్యక్షుడిగా దేవరపల్లి రాయుడుబాబు, కార్యదర్శిగా కూనపాము రామారావు, ట్రెజరర్‌గా నాదెళ్ల బుల్లి వెంకటరావు, ఉపాధ్యక్షుడిగా కిలారపు రుక్మిణీనాథ్, జాయింట్ కార్యదర్శిగా ఆలపాటి శ్రీనివాసరావు, ఈసీ హెల్త్‌గా చెన్నుబోయిన నరసింహారావు, ఈసీ ఎమర్జెన్సీగా నాదెళ్ల మంజునాథ్, ఈసీ అవేర్నెస్‌గా దావులూరి వెంకటరమణలు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.1000 నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికేట్, మెమెంటోలను అందజేశారు. అలాగే మానవత సంస్థ తరపున శాంతి రథం కొనుగోలుకు రూ.5.25 లక్షల విరాళాన్ని అందించిన మొగతడకల శ్రీనివాసరావు, లక్ష్మీరమణి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో మండల గౌరవ డైరెక్టర్‌లు, అడ్వైజర్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

మానవత సేవలు విస్తృతం

కొయ్యలగూడెం: మానవత శాఖ ద్వారా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తామని సంస్థ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన మాటూరి సుధీర్, కంభంపాటి వెంకట సాయి కృష్ణలు పేర్కొన్నారు. ఆదివారం రాత్రి కన్నాపురం రోడ్డులోని వాసవీ ఆడిటోరియంలో మానవత మండల శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవత సంస్థ 20 సంవత్సరాలుగా ప్రజలకు విశేష సేవలందిస్తూ పేద విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయమందిస్తుందని పేర్కొన్నారు. కోశాధికారిగా మోటమర్రి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఎం.రామకృష్ణ, టి.చంటి, వంకదారి సర్వేశ్వరరావు, ఎస్‌బీజీ శేఖర్, మట్టే శ్రీనివాసరావు, వై.ఉమామహేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారిని ప్రజా ప్రతినిధులు, సంస్థ సభ్యులు పూలమాలలు వేసి అభినందించారు.

శరీర అవయదానంతో పునర్జన్మ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అనుకోని పరిస్థితుల్లో దురదృష్టకరంగా ఎవరికైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి అవయవాలను దానం చేయడం ద్వారా 18 మందికి పునర్జన్మ ప్రసాదించవచ్చని విశాఖపట్నంకు చెందిన సావిత్రి బాయి ఫూలే ఎడ్యుకేషనల్ – ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు, అఖిల భారత అవయవదాతల సంఘం చైర్‌పర్సన్ గూడూరి సీతా మహాలక్ష్మి తెలిపారు. ఆదివారం స్థానిక పత్తేబాదలోని శ్రీ సాయి రాధా మినీ ఫంక్షన్ హాల్లో మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శరీర దానం, అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అవయవ దానంపై పూర్తి సమాచారం అందించారు. శరీర దానం చేయాలంటే ఎలా దరఖాస్తు చేయాలో వివరించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి పునర్జన్మని ఇవ్వడం కంటే జన్మ సార్థకత ఏముంటుందన్నారు. మట్టిలో కలిసిపోయే దేహానికి మరొక జన్మకు అవకాశం కల్పించగలగడం అరుదైన అవకాశం అని వివరించారు. శరీర దానం వైద్యవృత్తిలో అధ్యయనం నిమిత్తం ఉపయోగపడుతుందని, అవయవ దానం వల్ల ఇతరులకు పునర్జన్మ ఇవ్వడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. అధ్యక్షుడు అబ్బూరి సూర్యనారాయణ మాతృదేవోభవ సేవా ట్రస్ట్ ఆశయాలను, సభ్యుల కృషిని వివరించారు. కార్యదర్శి కూచిపూడి సత్యనారాయణ నూతన సభ్యులను పరిచయం చేసి, సంస్థ కార్యక్రమాలను వివరించారు. ఈ శరీరదానం, అవయవదానం ఆవశ్యకతను, ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళతామన్నారు. తమ ట్రస్ట్ సభ్యుల నుంచే ఈ కార్యక్రమంలో దరఖాస్తులు నమోదు చేయడం ప్రారంభిస్తామన్నారు. ఆసక్తిగల వారికి సహకారం అందించి ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్తామన్నారు.